AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM
23-5-2026 (Saturday) MAIN EDITION

## ఏఐతో ఫిర్యాదుల నమోదు



**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ పోలీసులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి టెక్నాలజీని వినియోగిస్తున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు భాషా పరమైన ఇబ్బందులు కలగకుండా, వారి ఫిర్యాదులను త్వరితగతిన, కచ్చితత్వంతో నమోదు చేసేందుకు దేశంలోనే తొలిసారిగా ఏఐ కాప్‌రైటర్ అనే కృత్రిమ మేధ ఆధారిత మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీలో శనివారం ఏఐ కాప్‌రైటర్ యాప్‌ను హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆవిష్కరించారు. నగరంలోని 80కి పైగా పోలీస్ స్టేషన్లలో అందుబాటులోకి రానున్నాయి.

## పాలిసెట్ ఫలితాలు విడుదల



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ పాలిసెట్ 2026 ఫలితాలు విడుదలయ్యాయి. పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాల కోసం మే 13న రాష్ట్ర వ్యాప్తంగా పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ శ్రీదేవసేన పాలిసెట్ ఫలితాలను శనివారం ఉదయం విడుదల చేశారు. ఈ పరీక్షకు 98,029 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులు తమ హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేది వివరాలు నమోదు చేసి ఫలితాలు చెక్ చేసుకోవచ్చు. రెండు విడతల్లో కాలేజీల్లో సీట్లను భర్తీ చేయడానికి ఇప్పటికే అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు.

## రాజౌరీలో ఎదురుకాల్పులు..



అక్షరటుడే, నేషనల్ డెస్క్: జమ్మూ కాశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలోని అడవుల్లో ఉగ్రవాదులు, భద్రతా దళాలకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఉగ్రవాదుల కదలికల గురించి సమాచారం అందుకున్న భద్రతా దళాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ సమయంలో ఉగ్రవా దులు, భద్రతా దళాల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి.

## చైనాలోని బొగ్గు గనిలో పేలుడు..



అక్షరటుడే, నేషనల్‌డెస్క్: చైనాలోని ఒక బొగ్గు గనిలో సంభవించిన గ్యాస్ పేలుడులో 80 మందికి పైగా మరణించినట్లు సమాచారం. ఉత్తర చైనాలోని షాన్‌క్సీ ప్రావిన్స్, క్విన్యువాన్ కౌంటీలో ఉన్న ఓ బొగ్గు గనిలో పేలుడు సంభవించింది. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలుస్తోంది.

## విప్ పదవికి అరవ శ్రీధర్ రాజీనామా



అక్షరటుడే, ఏపీ: జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ భేటీ అయ్యారు. శాసనసభ విప్ పదవికి రాజీనామా చేస్తూ పవన్ కళ్యాణ్‌కు పత్రాన్ని అందజేశారు. వ్యక్తిగత కారణాల వల్లే విప్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు స్పష్టం చేసినట్లు సమాచారం.

# కాంగ్రెస్‌లో బిగ్ చిచ్చు!

- పీసీసీ చీఫ్‌కు వ్యతిరేకంగా ఓ ఛానల్‌లో కథనాలు
- సీఎం సన్నిహితుడి మీడియాలో మహేశ్‌కుమార్‌పై దాడి
- 'డిజాస్టర్ ప్రెసిడెంట్' అంటూ వరుస ప్రోగ్రామ్‌లు
- రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసిన వైనం
- ఆరోపణలపై ధీటుగా స్పందించిన రాష్ట్ర అధ్యక్షుడు



**టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు వ్యతిరేకంగా ఓ టీవీ ఛానల్‌లో వరుస కథనాలు ప్రచురించడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. సీఎం రేవంత్‌రెడ్డి సన్నిహితుడికి చెందిన సదరు ఛానెల్‌లో ఏకంగా పీసీసీ అధ్యక్షుడిపై నెగిటివ్ కథనాలు రావడం గమనార్హం. 'డిజాస్టర్ ప్రెసిడెంట్' అనే క్యాప్షన్‌తో ఒక రోజంతా సదరు మీడియాలో వరుస కథనాలు ఇవ్వడం వెనక ఎవరున్నారనే చర్చ జరుగుతోంది. ఈ కథనాలతో కాంగ్రెస్‌లో చిచ్చు రేగింది. బీసీ నేతపై కావాలనే లక్ష్యంగా చేసుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నారు.** —అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

నిజామాబాద్ జిల్లాకు చెందిన మహేశ్‌కుమార్ గౌడ్ పీసీసీ ఛీఫ్‌గా బాధ్యతలు చేపట్టి 20 నెలలు గడుస్తోంది. ఆయన పదవి చేపట్టాక ఉప ఎన్నికలు, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటింది. అయినప్పటికీ కాంగ్రెస్ అనుకూల ఛానల్లో 'డిజాస్టర్ ప్రెసిడెంట్' అని కథనాలు ప్రసారం చేయడం గమనార్హం. పార్టీ బలోపేతం కోసం మహేశ్ గౌడ్ అనేక చర్యలు చేపట్టారు. పలు జిల్లాల్లో పర్యటించారు. అయినప్పటికీ సదరు మీడియాలో ఏకంగా పీసీసీ చీఫ్‌కు వ్యతిరేకంగా వార్తలు రావడం పార్టీ శ్రేణుల్లో ఆందోళన కలిగిస్తోంది. దీని వెనుక ఎవరైనా ఉన్నారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

### రెండు వర్గాలుగా..

'పీసీసీ అధ్యక్షుడు గాంధీభవన్‌ను గాలికి వదిలేశారు.. సీలింగ్ ఊడుతుంది.. పెచ్చులు రాలుతున్నాయి.. కుక్కలు తిరుగుతున్నాయిజ.. బీర్ బాటిల్స్ దర్శనమిస్తున్నాయి..' అంటూ వరుస కథనాలు వచ్చాయి. ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని మహేష్ కుమార్ ఇల్లు అద్దంలా ఉందని, గాంధీ భవన్ ఎందుకలా తయారైందని ఉందని వరుస ఎపిసోడ్లు వేసింది. కాగా.. ప్రత్యేకించి బీసీ సామాజిక వర్గానికి చెందిన మహేశ్‌పై ప్రభుత్వానుకూల ఛానల్‌లో ఇలాంటి కథనాలు రావడంతో పార్టీ గందరగోళం నెలకొంది. దీంతో కాంగ్రెస్‌లో నాయకులు, కార్యకర్తలు రెండు వర్గాలుగా విడిపోయారు.

### బీసీ నేతపై..

బీసీ నేత మహేష్‌కుమార్ గౌడ్ తన రాజకీయ ప్రస్థానంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొని, ప్రజల మద్దతుతో, నిరంతర కష్టపడే తత్వంతో ఈ స్థాయికి చేరుకున్నారు. ఆయనకున్న ప్రజాదరణ, ఎదుగుదలను చూసి ఓర్వలేక, రాబోయే రోజుల్లో ఆయన మరింత ఉన్నత స్థానాలకు చేరుకుంటే తమ వర్గ ఆధిపత్యానికి గండి పడుతుందనే భయంతోనే ఈ ముందస్తు వ్యూహాత్మక దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. దీంతో బీసీ నాయకులు మహేశ్‌కు మద్దతు తెలుపుతున్నారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అధిష్టానం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.


### సంయమనం పాటించాలి: మహేశ్

తనపై వచ్చిన కథనాలపై మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు. గాంధీ భవన్‌లో ఆయన మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడారు. గాంధీ భవన్ ట్రస్ట్ కింద నడుస్తుందని తెలిపారు. వెనుక ప్రాపర్టీలో ఏమైనా జరిగితే అది కూడా మాకు ఆపాదిస్తే ఎలా అని ప్రశ్నించారు. పత్రిక స్వేచ్ఛను తాను నమ్ముతానన్నారు. అయితే తన పనితీరును బేరీజు వేయాల్సింది కార్యకర్తలు, ఏఐసీసీ నాయకులు అని స్పష్టం చేశారు. తనకు వ్యతిరేకంగా వార్త కథనాలు ప్రసారం నేపథ్యంలో పార్టీ శ్రేణులకు సూచించారు. ఒక ఛానల్ వాళ్లు అభిప్రాయం చెప్పినంత మాత్రానా భయపడనని ధీటుగా స్పందించారు.

### ఏఐసీసీ నిర్ణయాన్ని పాటిస్తా..

టీపీసీసీ చీఫ్ మార్పు అనేది ఏఐసీసీ నిర్ణయమని మహేశ్‌గౌడ్ తెలిపారు. పార్టీ అధిష్టానం నిర్ణయాన్ని తప్పకుండా పాటిస్తానని చెప్పారు. తన మీద నమ్మకంతో పార్టీ పెద్దలు ఈ అవకాశం ఇచ్చారని పేర్కొన్నారు. తాను, సీఎం కలిసికట్టుగా పని చేస్తున్నామని తెలిపారు. తనపై గిట్టని వారు ఇలాంటి ప్రచారం చేస్తున్నారని అభిప్రాయం వ్యక్తం చేశారు. అన్నింటికీ కాలమే సమాధానం చెబుతుందన్నారు. ఒక న్యూస్ ఛానల్‌లో తనపై, కాంగ్రెస్ పార్టీ పై కల్పిత కథనాలు రోజంతా ప్రసారం చేశారని పేర్కొన్నారు. అభూత కల్పనలు, అసత్యాలతో వ్యక్తిగతంగా అప్రతిష్ట పాలు చేసే విధంగా కథనాలు ప్రసారం అయ్యాయని తెలిపారు. మీడియాలో ఏదో వచ్చినంత మాత్రాన ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

## యాదగిరిగుట్టలో వేద పాఠశాలకు సీఎం శంకుస్థాపన



**అక్షరటుడే, యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని సీఎం రేవంత్‌రెడ్డి శనివారం దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. యాదగిరిగుట్టలో వేద పాఠశాల నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో యాదగిరి గుట్టకు చేరుకున్న ముఖ్యమంత్రికి అధికారులు, ఆలయ పూజారులు స్వాగతం పలికారు. అనంతరం గుట్టకు చేరుకున్న సీఎం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కంచి కామకోటీ పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి ఆశీర్వాదం తీసుకున్నారు.

## బీఆర్ఎస్‌లో హరీశ్‌రావు ఫ్యూచర్ ఏంటో..: పొంగులేటి



**అక్షరటుడే, హైదరాబాద్:** మాజీ మంత్రి హరీశ్ రావుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్‌లో హరీశ్‌రావు ఫ్యూచర్ ఏమిటో ఆయనకే తెలియదని పేర్కొన్నారు. అమెరికాలో ఉండి ఫ్యూచర్ సిటీని ఆపేస్తాం అంటూ ప్రకటించిన హరీష్ రావు.. ఈ భూములను తాకట్టు పెట్టడానికి అమెరికాలో ఎవరితోనైనా ఒప్పందం చేసుకున్నారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలో హైదరాబాద్‌లో కనీసం ఒక్క మెట్రో స్టేషన్ కూడా కట్టని మీకు.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా ఒక నగరమే నిర్మిస్తున్నది అంటే అసూయ కలగక తప్పదని పొంగులేటి విమర్శించారు. కేసీఆర్ కుటుంబ సభ్యుల కోసం ఎక్కడ పడితే అక్కడ ఫాంహౌస్ లు కట్టుకున్నారని ఆరోపించారు. తాము రాష్ట్రం కోసం ఫ్యూచర్ సిటీ కడుతుంటే ఆపుతాం అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



## కాశీలో గంగాస్నానం చేస్తూ బీరు తాగిన వ్యక్తి..

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్ :** భక్తులు ఎంతో పవిత్రంగా భావించే కాశీలో ఓ వ్యక్తి గంగాస్నానం చేస్తూ బీరు తాగాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కాగా.. భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేశారు. వైరల్ అయిన వీడియోలో ఆ వ్యక్తి నదిలో స్నానం చేస్తూ బీరు తాగుతున్నట్లు కనిపిస్తోంది. నిందితుడిని బీహార్‌లోని రోహ్‌తాస్ జిల్లా నివాసిగా గుర్తించామని అధికారులు తెలిపారు.

## హైదరాబాద్‌లో న్యాయవాది హత్య




**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్‌లో ఓ న్యాయవాది హత్య తీవ్ర కలకలం రేపింది. నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మాసబ్‌ట్యాంక్‌లో న్యాయవాది ఖాజా మొయినుద్దీన్‌ను శనివారం ఉదయం తన ఇంటి నుంచి బయటకు వచ్చారు. కారులో ఎక్కడానికి యత్నిస్తుండగా దుండగులు మరో కారులో వేగంగా కారుతో ఢీ కొట్టి దుండగులు పారిపోయారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ ఆయనను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆయన చికిత్స పొందుతూ చనిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. ఖాజా మొయినుద్దీన్ వక్ఫ్ బోర్డు భూముల రక్షణ కోసం పోరాడుతున్నారు.

## జలవిద్యుత్ కేంద్రంలో భారీ అగ్ని ప్రమాదం

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఒడిశాలోని మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పవర్ స్టేషన్ షట్‌డౌన్ అయిన అనంతరం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. విద్యుత్ కేంద్రంలో మంటలు అంటుకున్న సమయంలో పలువురు కార్మికులు రెండో అంతస్తులో చిక్కుకుపోయారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

## కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ నియామకం..



**అక్షరటుడే, హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీని నియమించింది. ఈ మేరకు ఎస్సీ సెల్ అధ్యక్షుడు మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై కాంగ్రెస్ దృష్టి పెట్టింది. గతంలోనే డీసీసీలను నియమించిన కాంగ్రెస్ తాజాగా ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీని నియామకం పూర్తి చేసింది. ఈ కమిటీలో 16 మంది వైస్ ఛైర్మన్లు, 9 మంది జనరల్ సెక్రెటరీలు, 29 మంది సెక్రెటరీలు 29 ఉంటారు. అలాగే 27 జిల్లాలకు నూతన అధ్యక్షులను ఎస్సీ సెల్ ఛైర్మన్ నియమించారు.

## బికినీ విజువల్స్‌పై స్పందించిన రుక్మిణి వసంత్..



నటి రుక్మిణి వసంత్ బికినీలో ఉన్న వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అయిన విషయం తెలిసిందే. ఈ వీడియోలపై ఆమె ఘాటుగా స్పందించారు. అవన్నీ 'ఏఐ డీప్‌ఫేక్' సృష్టించిన నకిలీ విజువల్స్ అని స్పష్టం చేస్తూ ఒక ప్రెస్ నోట్ రిలీజ్ చేశారు. ఇలా మార్చబడిన కంటెంట్‌ను ప్రచారం చేయడం తీవ్రమైన బాధ్యతా రాహిత్యమని పేర్కొన్నారు. ఈ తప్పుడు ఫొటోలు, వీడియోలను సృష్టించి, వ్యాప్తి చేసిన వారిపై చట్టపరమైన, సైబర్ క్రైమ్ కింద చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. వీడియోలపై రుక్మిణి ఇచ్చిన క్లారిటీతో రూమర్లకు తెరపడింది.

– అక్షరటుడే, సినిమాడెస్క్